సాక్షి
కామారెడ్డి
శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు

జిల్లాలో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ బారిన పడుతున్నారు.

- 12లో ▸



ఆర్థికాభివృద్ధి సాధించాలి

మహిళా సంఘాల సభ్యులు ఆర్థికాభివృద్ధి సాధించాలని అదనపు డీఆర్డీవో మురళీకృష్ణ సూచించారు.

- 11లో ▸

గరిష్టం/కనిష్టం
36.4 /23.3

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి. రాత్రి చలిగా ఉంటుంది.

పాలనలో సంగ్వాన్ మార్క్!

జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు స్వీకరించి వంద రోజులు గడిచాయి. తక్కువ కాలంలోనే ఆయన జిల్లా పాలనపై తనదైన ముద్ర వేశారు. నిత్యం అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూనే.. క్షేత్రస్థాయి పర్యటనలూ చేస్తున్నారు. ఉద్యోగులు సమయ పాలన పాటించేలా చూసేందుకు కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు విధానం పకడ్బందీగా అమలయ్యేలా చూస్తున్నారు. బాధ్యతగా పనిచేసే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తూ.. విధులలో నిర్లక్ష్యంగా ఉండేవారికి క్లాస్ తీసుకుంటూ మార్పుకోసం కృషి చేస్తున్నారు.



- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించి మూడున్నర నెలలు
- రోజూ క్షేత్రస్థాయి పర్యటనలు.. క్రమం తప్పకుండా సమీక్షలు
- ప్రజావాణిలో జూమ్ మీటింగ్ ద్వారా మండల అధికారులకు ఆదేశాలు
- అమలులోకి ఈ–ఫైలింగ్ విధానం
- కలెక్టరేట్‌లో పకడ్బందీగా బయోమెట్రిక్ హాజరు..
- సకాలంలో విధులకు వస్తున్న ఉద్యోగులు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ జూన్ 16న బాధ్యతలు స్వీకరించారు. ఆయన నిర్మల్‌నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన మూడో రోజు నుంచే జిల్లాలో పర్యటనలు షురూ చేశారు. మూడున్నర నెలల్లో దాదాపు జిల్లాను చుట్టివచ్చారు. రోజూ మధ్యాహ్నం వరకు క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత కార్యాలయానికి చేరుకుని సమీక్షలు నిర్వహిస్తూ, ఫైల్స్ క్లియర్ చేయడంపై దృష్టిపెడుతున్నారు. ధరణికి సంబంధించి పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్‌పై ఫోకస్ చేస్తున్నారు. సమయం చిక్కినప్పుడల్లా క్యాంప్ కార్యాలయానికి అధికారులను పిలిపించి పెండింగ్‌లో ఉన్న ధరణి ఫైల్స్‌ను క్లియర్ చేయడం ద్వారా ఫిర్యాదులను తగ్గించడానికి కృషి చేస్తున్నారు. అలాగే బాధ్యతగా పనిచేసే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తున్నారు. విధులలో నిర్లక్ష్యంగా ఉండేవారికి, సరైన సమాచారం లేకుండా సమావేశాలకు వచ్చేవారికి క్లాస్ తీసుకుంటూ వారు పనితీరు మెరుగుపరచుకునేలా చూస్తున్నారు.

కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు..



కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ హాజరు నమోదు చేసుకుంటున్న ఉద్యోగులు

కలెక్టరేట్‌లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు సకాలంలో కార్యాలయానికి చేరుకునేందుకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేశారు. కలెక్టరేట్‌లో 542 మంది ఉద్యోగులున్నారు. వీరంతా రోజూ ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ విధానంలో హాజరు వేయాల్సిందే. చాలామంది ఉద్యోగులు హైదరాబాద్, నిజామాబాద్ వంటి నగరాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు గతంలో ఇష్టానుసారంగా విధులకు హాజరయ్యేవారన్న ఆరోపణలున్నాయి. ట్రెన్ వెళ్లిపోతుందని ముందుగానే వెళ్లిపోయేవారు. బయోమెట్రిక్ హాజరు విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తుండడంతో ఉద్యోగులు సకాలంలో కార్యాలయాలకు చేరుకుంటున్నారు. సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటున్నారు.



ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రభుత్వ శాఖల్లో ఈ–ఫైలింగ్ విధానం

ప్రభుత్వ శాఖల్లో ఈ–ఫైలింగ్ విధానం అమలుకు కలెక్టర్ చర్యలు చేపట్టారు. రెవెన్యూ, హెల్త్, పౌర సంబంధాలు తదితర శాఖల్లో ప్రతీది ఈ–ఫైలింగ్ ద్వారానే జరుగుతోంది. రోజూ కలెక్టర్ ఆన్‌లైన్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్నారు. ఈ విధానం అన్ని శాఖల్లో కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫైల్స్ పట్టుకుని తిరిగేకన్నా ఈ–ఫైల్ ద్వారా ఆన్‌లైన్‌లో పెడితే సకాలంలో వాటిని చూసి పరిష్కరించడానికి అవకాశం ఉంటుందని కలెక్టర్ చెబుతున్నారు. అన్ని శాఖల్లోనూ ఈ–ఫైలింగ్ అమలయ్యేలా ఆయన చర్యలు తీసుకుంటున్నారు.

ప్రజావాణిపై ఎప్పటికప్పుడు ఆదేశాలు..

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. ఆశిష్ సంగ్వాన్ ప్రజావాణికి తప్పనిసరిగా హాజరవుతున్నారు. గతంలో జిల్లా స్థాయి అధికారులు కొందరు డుమ్మాకొట్టేవారు. కానీ ఆశిష్ సంగ్వాన్ ఆదేశాలతో అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో భాగమవుతున్నారు. ఆశిష్ సంగ్వాన్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజావాణిలో జూమ్ విధానం అమలు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల అధికారులు సోమవారం ప్రజావాణి కార్యక్రమం ప్రారంభం నుంచి ముగిసేదాకా కచ్చితంగా జూమ్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయా మండలాల్లో తహసీల్ కార్యాలయాల నుంచి తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు ఇతర శాఖల అధికారులు జూమ్‌లో పాల్గొంటారు. కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి వచ్చి వినతులను చదివి.. ఒకవేళ మండల స్థాయిలో పరిష్కరించగలిగే సమస్య అయితే సంబంధిత మండల అధికారులతో కలెక్టర్ జూమ్ ద్వారా అనుసంధానం అవుతారు. సమస్యను వివరించి, ఎప్పటిలోగా పరిష్కరిస్తారో చెప్పాలని సంబంధిత మండల అధికారిని ప్రశ్నిస్తారు. దీంతో ప్రజావాణి సమస్యలు త్వరగా పరిష్కారానికి నోచుకుంటున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు.



ప్రజావాణి నుంచి జూమ్ ద్వారా మండల అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కష్టపడిన వారికి గుర్తింపు



నూతన పాలకవర్గంతో ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

ఎల్లారెడ్డి: పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని ఎంపీ సురేశ్ షెట్కార్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నిర్వహించిన ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చైర్‌పర్సన్‌గా మారెడ్డి రజిత, వైస్ చైర్మన్‌గా జొన్నల రాజు, డైరెక్టర్లుగా లక్ష్మీనారాయణ, పూల్‌సింగ్, గోపాల్, గంగారెడ్డి, శంకరయ్య, నాగేశ్వర్, నరేందర్‌రెడ్డి, నాగేశ్, అజీముద్దీన్, కంచర్ల శ్రీనివాస్, ముప్పిడి హరినారాయణతో జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ సురేశ్ షెట్కార్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం నెరవేరుస్తోందన్నారు. త్వరలోనే రైతు భరోసా అందిస్తామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తానన్నారు. కార్యక్రమం అనంతరం ఏఎంసీ కార్యాలయంలో పాలకవర్గ సభ్యులు పదవీ బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఉషాగౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, గఫార్, షెకావత్, సామెల్, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

30న జాబ్ మేళా

కామారెడ్డి టౌన్: జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో సోమవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్ బ్యాంక్‌లలో శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగ నియామకాల కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 81067 64653 నంబరులో సంప్రదించాలని సూచించారు.

న్యూస్‌రీల్

'పరీక్షించిన తర్వాతే నీటిని సరఫరా చేయాలి'



బాన్సువాడ: ముందుగా నీటి పరీక్షలు చేసిన తర్వాతే ప్రజలకు సరఫరా చేయాలని ఉమ్మడి జిల్లా మిషన్ భగీరథ ఎస్ఈ రాజేంద్రకుమార్ సూచించారు. బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో తాగునీటి సహాయకులకు శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైపులైన్ లీకేజీలు ఉంటే పంచాయతీ కార్యదర్శుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. రక్షిత మంచినీటి ట్యాంకులను తరచూ శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ డీఈ వెంకటేష్‌గౌడ్, ఏడీఏ అనిల్‌కుమార్, ఎంపీడీవో భారతి, ఎంపీవో మహబూబ్, ఏఈలు జగదీశ్, అశ్విని, ల్యాబ్ టెక్నీషియన్లు రమేశ్, శ్రీనివాస్, ఫీల్డ్ అసిస్టెంట్ సక్రమ్ తదితరులు ఉన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



కామారెడ్డి క్రైం : సదాశివనగర్ మండలంలోని పలు పాఠశాలల బస్సులను శుక్రవారం రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. సంబంధిత యాజమాన్యాలు ఎప్పటికప్పుడు బస్సుల ఫిట్‌నెస్ పరీక్షించుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. తనిఖీల్లో ఎంవీఐ మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పిల్లలను సంస్కరించే బాధ్యత తల్లిదండ్రులదే



సుభాష్‌నగర్ : పిల్లలను సంస్కరించే బాధ్యత తల్లిదండ్రులదేనని రాష్ట్ర సేవికా సమితి జిల్లా బౌద్ధిక్ ప్రముఖ్ శుభ పేర్కొన్నారు. శుక్రవారం భారతమాత భజన్ పరివార్ ఆధ్వర్యంలో నిజామాబాద్ శివాజీనగర్ మున్నూరుకాపు కల్యాణ మండపంలో భజన మండలి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్రపతి శివాజీని తయారు చేసింది ఆయన తల్లి జిజియామాత అని, స్వామి వివేకానందను రూపుదిద్దింది కూడా ఆయన తల్లేనని పేర్కొన్నారు. మన సంస్కృతి, వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ భజన మండలి పేరుతో వేలాదిమందిని ఒక కుటుంబంగా మార్చిన ఘనత సుబ్బారావుకు దక్కుతుందన్నారు. ఆయన కృషి ఫలితంగా దాదాపు 100 భజన మండళ్లు ఏర్పడ్డాయన్నారు. భజన పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఈమని సాయిప్రసాద్, బూర్ల రవీంద్ర వ్యవహరించారు. భారతమాత భజన మండలి వ్యవస్థాపకుడు వైట్ల సుబ్బారావు, ప్రతినిధులు సుబేదార్, గణేశ్, గంగకిషన్, రవి తదితరులు పాల్గొన్నారు.

30న జిల్లాకు ఎక్సైజ్ మంత్రి రాక

ఖలీల్‌వాడి(నిజామాబాద్ అర్బన్): ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. మోర్తాడ్, భీమ్‌గల్‌లో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ కార్యాలయాలను ప్రారంభించనున్నారు.

విద్యుత్ శాఖలో బదిలీలకు గ్రీన్ సిగ్నల్

సుభాష్‌నగర్: ఎన్‌పీడీసీఎల్‌లో ఉద్యోగుల బదిలీలకు విద్యుత్ శాఖ పచ్చజెండా ఊపింది. ఈ మేరకు ఆన్‌లైన్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టేందుకు మార్గదర్శకాలను శుక్రవారం సీఎండీ వరుణ్‌రెడ్డి జారీ చేశారు. వచ్చేనెల 7లోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని, బదిలీ అయినవారు 9వ తేదీలోపు ఆయా స్థానాల్లో చేరాలని ఆదేశించారు. 2024 జూన్ 30 వరకు రెండేళ్లు పూర్తి చేసుకున్న 50 శాతం ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. సబ్ ఇంజినీర్, ఏఈ, ఏడీఈ, డీఈ, అకౌంట్స్ ఆఫీసర్, ఎస్ఏవో, ఏవో, జేఏవో, ఫోర్‌మన్, ఎస్ఎల్ఐ స్థాయి ఉద్యోగులను బదిలీ చేయనున్నారు. క్షేత్రస్థాయి సిబ్బందికి డీఈలు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేపడతారు.

ప్రతిపాదనలు సిద్ధం చేయండి

కామారెడ్డి క్రైం: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో అత్యవసర మరమ్మతులకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత ప్రిన్సిపాల్‌లు, వసతి గృహాల సంక్షేమ అధికారులతో కలెక్టరేట్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి సమస్య ఉత్పన్నమైన వెంటనే పరిష్కరించే దిశగా ప్రతిపాదించాలని సూచించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత ఉన్నతాధికారికి తెలియజేయాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో చందర్‌నాయక్, ఎస్సీ సంక్షేమ అధికారి రజిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, ఈడబ్ల్యూఐడీసీ ఇంజినీరింగ్ అధికారులు, ప్రిన్సిపాల్‌లు, వసతి గృహాల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కారణంగా దెబ్బతిన్న పనుల కోసం..

వర్షాల కారణంగా దెబ్బతిన్న రోడ్లు, కాల్వల మరమ్మతులను అక్టోబర్ 7లోగా పూర్తి చేయాలని కలెక్టర్ సంగ్వాన్ అన్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కాల్వలు తదితర మరమ్మతుల పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సుజాత, డీపీవో శ్రీనివాస్‌రావు, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్, ఆయాశాఖల ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

లింగంపేట ఆదర్శంగా నిలవాలి

- చారిత్రక కట్టడాలను కాపాడుకోవాలి
- నాగన్నగారి బావితో గుర్తింపు..
- రామాలయం, ఊగే ధ్వజస్తంభాన్ని అభివృద్ధి చేస్తాం
- పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

లింగంపేట(ఎల్లారెడ్డి) : నాగన్నగారి మెట్లబావి లింగంపేటకు చిహ్నామని, జిల్లాకు ఈ గ్రామం ఆదర్శంగా నిలవాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. గ్రామంలోని రామాలయం, ఊగే ధ్వజస్తంభాన్ని అభివృద్ధి చేస్తామని, చారిత్రక కట్టడాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. మండల కేంద్రంలోని నాగన్నగారి మెట్ల బావి వద్ద లింగంపేట ఏర్పాటు చేసిన ప్రపంచ పర్యాటక దినోత్సవం కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణం, పచ్చదనం ప్రతిబింబించేలా విద్యార్థులు వేసిన చిత్రాలను తిలకించడంతోపాటు మహిళా సంఘాల సభ్యుల స్వగృహ ఫుడ్స్ స్టాల్‌ను పరిశీలించారు. పిండి వంటల రుచి చూసి బాగున్నాయని మహిళలను అభినందించారు. స్వగృహ ఫుడ్‌స్టాల్‌ను లింగంపేటలో ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పర్యాటక దినోత్సవ వేడుకలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ నాగన్నగారి బావి వద్ద హోటళ్లు, రెస్టారెంట్లు, ఫ్రూట్ స్టాల్స్ ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆర్థిక వనరులు చేకూరుతాయన్నారు. బావి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. బావి సందర్శనకు రూ.10, ఫొటో, వీడియో షూట్‌కు రూ.500 వసూలు చేసేలా ఏర్పాటు చేశామని, ఆ డబ్బులతో బావిని అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఆర్డీవో ప్రభాకర్, జెడ్పీ సీఈవో చందర్‌నాయక్, తహసీల్దార్ నరేందర్‌గౌడ్, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్హారి, ఎంఈవో షౌకత్, ఏపీఎం శ్రీనివాస్, ఆయా గ్రామాల కార్యదర్శులు, అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆగని లింగ నిర్ధారణ పరీక్షలు

- బయటపడుతున్న సమన్విత ఆస్పత్రి దారుణాలు
- ఇప్పటికే రెండుసార్లు ఆస్పత్రి సీజ్
- కేసులు నమోదు చేసినా మారని యాజమాన్యం
- తాజాగా లింగ నిర్ధారణ కేసులో డాక్టర్ ప్రవీణ్ అరెస్ట్
- అదుపులోకి తీసుకున్న మహారాష్ట్రలోని ఉద్గీర్ రూరల్ పోలీసులు

కామారెడ్డి టౌన్: ఎన్నిసార్లు కేసులు నమోదుచేసినా కామారెడ్డిలోని సమన్విత ఆస్పత్రి యాజమాన్యం తీరు మారడం లేదు. లింగ నిర్ధారణ పరీక్షలను ఆపడం లేదు. ఈ విషయంలో ఇప్పటికే ఆస్పత్రిని రెండుసార్లు సీజ్ అయిన విషయం తెలిసిందే.. తాజాగా మహారాష్ట్ర పోలీసులు ఆస్పత్రి డాక్టర్ ప్రవీణ్‌ను అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. వివరాలిలా ఉన్నాయి.

గాంధారి సీహెచ్‌సీలో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ ప్రవీణ్.. కామారెడ్డిలో సమన్విత పేరుతో ప్రైవేట్ ఆస్పత్రి నిర్వహిస్తున్నాడు. మహారాష్ట్రలోని ఉద్గీర్ ప్రాంతానికి చెందిన ఓ ఐదు నెలల గర్భిణి, ఆమె భర్త కలిసి మూడు నెలల క్రితం ఈ ఆస్పత్రికి వచ్చారు. స్కానింగ్ చేసిన వైద్యుడు పుట్టబోయేది ఆడపిల్లని చెప్పాడు. రెండోసారి కూడా ఆడపిల్లే పుడుతుందని తెలియడంతో ఆ దంపతులు మహారాష్ట్రకు వెళ్లి అబార్షన్ చేయించుకున్నారు. ఇటీవల ఆ దంపతుల మధ్య గొడవలు జరిగి, విషయం పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. కేసు నమోదు చేసుకున్న ఉద్గీర్ రూరల్ పోలీసులు.. శుక్రవారం సాయంత్రం కామారెడ్డికి వచ్చారు. సమన్విత ఆస్పత్రిలో వైద్యుడిని విచారించి, పట్టణ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం వైద్యుడిని అరెస్ట్ చేసి మహారాష్ట్ర పోలీసులు వెంట తీసుకెళ్లారు.



సమన్విత ఆస్పత్రిని సీజ్ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు (ఫైల్)

యథేచ్ఛగా నిర్వహణ

జిల్లా కేంద్రంలోని శ్రీరాంనగర్ కాలనీలోగల కౌసల్య ఆస్పత్రిలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు జరుగుతున్నాయని అధికారులకు 2021లో ఫిర్యాదులు అందాయి. దీంతో ఆ ఏడాది జూలై 14న వైద్య ఆరోగ్యశాఖ డెకాయ్ ఆపరేషన్ నిర్వహించింది. అప్పట్లో డాక్టర్ ప్రవీణ్ తండ్రి సిద్ధిరాములుతో పాటు మరికొందరిని అరెస్టు చేసి ఆస్పత్రిని సీజ్ చేశారు. కొన్నాళ్ల తర్వాత సదరు వైద్యుడు అదే కాలనీలో అద్దాల మేడ నిర్మించి, సమన్విత పేరుతో తిరిగి ఆస్పత్రిని ప్రారంభించాడు. ఇటీవల ఆస్పత్రిలో శిశువును విక్రయించినట్లు ఫిర్యాదు రావడంతో ఈ ఏడాది జూలై 7వ తేదీన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మరోసారి సీజ్ చేశారు. అయితే ఆస్పత్రి నిర్వాహకులు కోర్టునుంచి స్టే తెచ్చుకుని ఆస్పత్రిని మళ్లీ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో లింగ నిర్ధారణ కేసులో మహారాష్ట్ర పోలీసులు ఆస్పత్రి వైద్యుడిని అరెస్ట్ చేసి తీసుకువెళ్లడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

సన్నరకాల నిర్ధారణ బాధ్యత మాకొద్దు

- వ్యవసాయ అధికారులే గుర్తించేలా ప్రభుత్వానికి విన్నవించాలి
- ఐడీసీఎంఎస్ మహాజన సభలో సొసైటీ చైర్మన్లు



మాట్లాడుతున్న చైర్మన్ తారాచంద్ నాయక్

సుభాష్‌నగర్ : ప్రభుత్వం సన్నరకం ధాన్యంలో ఎంపిక చేసిన వాటికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ప్రకటించిన నేపథ్యంలో ధాన్యం నిర్ధారణ బాధ్యతలు సొసైటీలకు అప్పగించవద్దని చైర్మన్లు డీసీఎంఎస్ మహాజన సభ దృష్టికి తెచ్చారు. సన్నరకాల నిర్ధారణ బాధ్యతను వ్యవసాయశాఖ అధికారులకు అప్పగించాలని ప్రభుత్వానికి విన్నవించాలని కోరారు. శుక్రవారం నగరంలోని ఐడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ తారాచంద్ నాయక్ అధ్యక్షతన మహాజన సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎన్‌డీసీసీబీ చైర్మన్ కుంట రమేశ్‌రెడ్డి హాజరయ్యారు. ఏప్రిల్ 2024 నుంచి ఆగస్టు 2024 వరకు వ్యాపారం, క్రయ విక్రయాలు తదితర విషయాలను సభ్యులకు వివరించగా ఆమోదిస్తూ తీర్మానించారు. అయితే సన్నరకా నిర్ధారణ బాధ్యతలు సొసైటీలకు అప్పగిస్తే రైతుల్లో చెడ్డ పేరు వస్తుందని చైర్మన్లు మహాజన సభలో ఆందోళన వ్యక్తంచేశారు. పదవీ కాలం ముగిసే సమయంలో చెడ్డ పేరు తమకొద్దని చైర్మన్లు సభకు విన్నవించారు. అలాగే ఈ సీజన్‌లో సన్నరకాలకు దోమపోటు వచ్చిందని, దీంతో అధికంగా వచ్చే అవకాశముందని చైర్మన్లు పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని రైస్‌మిల్లర్లు తరుగును ఐదారు కిలోలపైనే తీసే ఆస్కారముంటుందని, ఈవిషయంలోనూ రైస్‌మిల్లర్లతో ఏదో ఒకటి తేల్చుకోవాలని కోరినట్లు తెలిసింది. తరుగుతో రైతుల వద్ద తాము తరచూ బదనాం అవుతున్నామని సభలో పలువురు చైర్మన్లు ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. రుణమాఫీ విషయంలోనూ సాంకేతిక లోపాల కారణంగా కొంతమందికి కాలేదని చైర్మన్లు సభ దృష్టికి తీసుకురాగా, ఆ సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి తెలిపారు. రూ.2 లక్షలు ఖాతాల్లో జమ చేస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదని, ఆపైన మొత్తం ఉన్న వారు చెల్లించాలనడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని చైర్మన్లు సభ దృష్టికి తెచ్చారు. డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఏదుళ్ల ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు పి సాయన్న, శ్రీనివాస్ గౌడ్, కపిల్‌రెడ్డి, రాజేశ్వర్, రాజాగౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్‌రావు, ఉమ్మడి జిల్లాలోని సొసైటీ చైర్మన్లు, బిజినెస్ మేనేజర్ నగేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

డ్రోన్లతో పిచికారీ.. అభినందనీయం

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండల రైతులకు పురుగు మందులు పిచికారి చేసే డ్రోన్లను అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని తహసీల్దార్ బావయ్య అన్నారు. పురుగు మందులను డ్రోన్‌ల ద్వారా చేయడం వలన సమయం, ఖర్చు, తగ్గుతుందన్నారు. అందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన ఫర్టిలైజర్ దుకాణ దారులను అభినందించారు. మాజీ సర్పంచ్ అరిగె సాయిలు, మాజీ ఎంపీటీసీ కంది మల్లేష్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్ తదితరులున్నారు.

బస్టాండ్‌ను అందుబాటులోకి తెస్తాం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి బస్టాండ్‌ను త్వరలోనే ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి బస్టాండ్ పనులను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించినా విడుదల కాలేదన్నారు. తన సహకారంతో బస్టాండ్ నిర్మాణానికి 2.5 కోట్ల నిధులను మంజూరు చేయించానన్నారు. త్వరలోనే బస్టాండ్ పనులను పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు.

ఎల్లారెడ్డి సివిల్ సప్లయ్ గోదాముల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి సివిల్ సప్లయ్ గోదాంను సివిల్ సప్లై డీఎం రాజేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. గోదాంలోని రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్ దుకాణాల ద్వారా గత నెలలో బియ్యం సక్రమంగా రాలేదని వచ్చిన ఫిర్యాదు మేరకు బియ్యంను పరిశీలించామన్నారు. ఇకనుంచి బియ్యం సక్రమంగా సరఫరా చేస్తామన్నారు. రేషన్ దుకాణాలకు సకాలంలో బియ్యం రవాణా చేయాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీటీ సురేష్, సిబ్బంది తదితరులున్నారు.

ఘనంగా ఊర పండుగ



బాన్సువాడ రూరల్ : మండలంలోని బోర్లంలో శుక్రవారం ఊరపండుగను కులసంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. గ్రామపెద్దలు బసిరెడ్డి హన్మంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, నర్సింహులు తదితరులున్నారు.

రాష్ట్రస్థాయిలో సత్తాచాటాలి



సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



విద్యార్థులు తయారుచేసిన మోడల్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : జిల్లా స్థాయిలో నిర్వహించే పోటీల్లో చక్కని ప్రదర్శన కనబరిచి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కామారెడ్డి కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను కలెక్టర్ సాంగ్వాన్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువజనోత్సవాల సందర్భంగా పలు పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన సైన్స్‌ఫేర్, కళా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. చక్కని ప్రదర్శనలు రూపొందించిన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. అనంతరం బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, డీఈవో రాజు, జిల్లా యువజన అధికారి జగన్నాథ్, మున్సిపల్ కమిషనర్ సుజాత, జిల్లా సైన్స్‌ఫేర్ అధికారి సిద్ధిరామి రెడ్డి, పలువురు అధికారులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని భూంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం కామారెడ్డిలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో పాల్గొని ప్రతిభ చూపారు. చంద్రయాన్ ప్రయోగం వర్కింగ్ మోడల్‌ను ప్రదర్శించారు. ఈ ప్రయోగాన్ని పరిశీలించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ పరిశీలించి సైన్స్ టీచర్ హైమవతిని, విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ యాదవ్, లింగం పాల్గొన్నారు.

లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

కామారెడ్డి క్రైం : కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా కామారెడ్డి కొత్త బస్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, బీసీ సంక్షేమ శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి చందర్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సుజాత, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ధరణి ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

బాన్సువాడ : తహసీల్ కార్యాలయంల్లో పనిచేస్తున్న ధరణి ఆపరేటర్ల సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం బాన్సువాడలో సబ్‌కలెక్టర్ కిరణ్మయికి కంప్యూటర్ ఆపరేటర్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆపరేటర్ సంఘం నేతలు శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ తహసీల్ కార్యాలయాల్లో ఏడు నెలలుగా పెండింగ్‌లోఉన్న ధరణి ఉద్యోగుల వేతనాలను మంజూరు చేయాలని కోరారు. 2018నుంచి తహసీల్ కార్యాలయాల్లో పనిచేస్తున్నామన్నారు. ఆరేళ్లలో ఏ ఒక్కనెల కూడా జీతాలు సక్రమంగా ఇవ్వలేదని, ఏజెన్సీని రద్దు చేసి ప్రభుత్వ ఖజానా ద్వారా జీతాలు చెల్లించాలని కోరారు.



సమస్యలు పరిష్కరించాలని సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ధరణి ఆపరేటర్లు

కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్లు ఎండీ ఫిరోజ్, రాజశేఖర్, హన్మంతు, ప్రవీణ్, రమేష్, మధు, గజానంద్ తదితరులు ఉన్నారు.

కుల బహిష్కరణతో వేధిస్తున్నారు

మాచారెడ్డి: కులాంతర వివాహం చేసుకున్న ఓ యువతికి సంబంధిన కుటుంబాలను కుల బహిష్కరణ చేసిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో జరిగింది. బాధితులు శుక్రవారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బంగ్లా రాజేందర్‌గౌడ్ కుమార్తె 2021లో కులాంతర వివాహం చేసుకుంది. నాటి నుంచి రాజేందర్‌గౌడ్‌కు చెందిన ఐదు కుటుంబాలను గౌడ సంఘ ప్రతినిధులు మంచి చెడులకు పిలవకుండా మానసికంగా హింసిస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ప్రజావాణిలో ఫిర్యాదు చే సినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ నెల 23న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమ తో మాట్లాడిన వారికి రూ. 50వేల జరిమానా విధిస్తామని సంఘం ప్రతినిధులు హుకుం జారీ చేసినట్లు బాధితులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

డబుల్ ఇళ్లకు హక్కుపత్రాలివ్వాలి



బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బైరాపూర్ వాసులు

బాన్సువాడ : బీర్కూర్ మండలం బైరాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు హక్కు పత్రాలు ఇవ్వాలని శుక్రవారం బాన్సువాడలో సబ్ కలెక్టర్ కిరణ్మయికి లబ్ధిదారులు వినతి పత్రం అందజేశారు. బైరాపూర్, మల్లాపూర్ గ్రామాల్లో 8 ఏళ్లక్రితం డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చారని, అప్పటి నుంచి ఇళ్లల్లోనే నివసిస్తున్న తమకు హక్కు పత్రాలు మాత్రం ఇవ్వలేదన్నారు. అంతకు ముందు లబ్ధిదారులు బీర్కూర్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ లతకు వినతి పత్రం అందజేశారు. అనంతరం బాన్సువాడలో సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

పార్కులో వసతులపై ఆరా..



బాన్సువాడ రూరల్ : మండల కేంద్రంలోని కల్కి చెరువు కట్టకు అనుకుని నిర్మించిన మల్టి జనరేషన్ పార్క్‌ను శుక్రవారం రాత్రి బాన్సువాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. సమస్యల గురించి పర్యాటకులతో మాట్లాడారు. నాయకులు అంజిరెడ్డి, పిట్ల శ్రీధర్, కనుకుట్ల రాజు పాల్గొన్నారు.

సైన్స్ మేళాలో విద్యార్థిని ప్రతిభ

భిక్కనూరు : జిల్లా కేంద్రంలో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యువజన ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సైన్స్ మేళాలో భిక్కనూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని పెద్దబచ్చగారి స్ఫూర్తి రెడ్డి శుక్రవారం ప్రథమ బహుమతి గెలుచుకుంది. ఇదే పాఠశాలకు చెందిన వైష్ణవి, సాయి శ్రేయాస్, శివరాజు, విశ్వక్‌రాజు తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి బహుమతులను అందజేశారు. సైన్స్ టీచర్లు రాజు సరితను ప్రత్యేకంగా అభినందించారు.

బస్టాండ్‌కు బెంచీల వితరణ



భిక్కనూరు : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో ప్రయాణికులు కూర్చునేందుకు వీవీ సిమెంట్ వర్క్స్ యజమాని వీరభద్రం రెండు సిమెంట్ బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ పెట్రోల్ బంక్ ఇన్‌చార్జి దాసు వీరభద్రంను అభినందించారు.

జీవదాన్ ఘటన బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కామారెడ్డి టౌన్ : జిల్లా కేంద్రంలోని జీవదాన్ స్కూల్‌లో ఈనెల 24వ తేదీన జరిగిన ఆందోళన, దాడులు చేసిన ఘటనలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్య క్షత్రీయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టు వేణుగోపాల్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కామారెడ్డి మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియతో పాటు కొందరు కౌన్సిలర్లు, వారి అనుచరులు స్కూల్‌లోకి ప్రవేశించగానే ఒక్కసారిగా పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసిందని ఆరోపించారు. విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

శతాధిక వృద్ధురాలు మృతి



భూమవ్వ(ఫైల్)

తాడ్వాయి: మండలంలోని ఎండ్రియాల్ గ్రామానికి చెందిన గడ్డం భూమవ్వ(119)అనే శతాధిక వృద్ధురాలు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన భూమవ్వకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె భర్త 30 ఏళ్ల క్రితం మృతి చెందాడు. నాటి నుంచి కూలీ పనిచేస్తూ కుటుంబానికి అండగా నిలిచింది. కొంత కాలంలో అనారోగ్యంతో బాధపడుతుండగా ఉదయం మృతి చెందింది. స్వాతంత్ర్య సమరం జరిగినప్పుడు భూమవ్వ కండ్లార చూసిందని గ్రామస్తులు తెలిపారు.

క్రైం కార్నర్

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

వర్ని: తలనొప్పి భరించలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన వర్ని మండలంలోని శ్రీనగర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై కృష్ణకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్త లీలావతి(41) కొంత కాలంగా తలనొప్పితో బాధపడుతోంది. ఆస్పత్రుల్లో చూయించినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుమారుడు సాయి నితిన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



లీలావతి మృతదేహం

కాలువలో మృతదేహం లభ్యం



మొగులయ్య(ఫైల్)

వర్ని: చందూర్‌లోని గ్రామపంచాయతీ పక్కన ఉన్న నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటరీ కాలువలో పోతంగల్ మండల కేంద్రానికి చెందిన మొగులయ్య(44) మృతదేహాన్ని లభ్యమైనట్లు వర్ని ఎస్సై కృష్ణకుమార్ పేర్కొన్నారు. వివరాలిలా ఉన్నాయి. పోతంగల్‌కు చెందిన మొగులయ్య ఈ నెల 23న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కాలువలో మృతదేహం ఉందన్న స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

స్వగ్రామానికి చేరిన మృతదేహం

ధర్పల్లి: మండలంలోని రామడుగు గ్రామానికి చెందిన బద్దుల గంగాధర్(48) ఉపాధి నిమిత్తం మస్కట్ దేశం వెళ్లాడు. అక్కడ ఫిట్స్ రావడంతో ఈనెల 24న మృతి చెందాడు. శుక్రవారం మతదేహం స్వగ్రామానికి చేరుకుంది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. గంగాధర్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

నిషేధిత గుట్కా పట్టివేత

బిచ్కుంద: మండల కేంద్రానికి చెందిన ఓ కిరాణ షాపు నిర్వాహకుడు నిషేధిత గుట్కాను ఆటోలో తరలిస్తుండగా పోలీసులు గురువారం రాత్రి గోపన పల్లి చౌరస్తాలో పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు పోలీసులు ఆటోను తనిఖీ చేయగా రూ. 4 లక్షల గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక, ఔరాద్ నుంచి రాత్రి సమయాల్లో గుట్కాలను బిచ్కుంద, బాన్సువాడ, నిజామాబాద్‌కు ఆటోల్లో తరలిస్తున్నారు. ఆటో డ్రైవరు, కిరాణ షాపు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

బోధన్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆచన్‌పల్లికి చెందిన లాల్‌అహ్మద్ సైకిల్‌పై బోధన్ వైపు వెళ్తుండగా బస్టాండ్ వద్ద పక్క నుంచి వెళ్తున్న కారును తప్పించబోయి ముందు ఉన్న లారీ వెనక ఉన్న టైర్ కింద పడడంతో కాలికి తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సీఐ వెంకటనారాయణ ఘటన స్థలానికి చేరుకొని వృద్ధుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సోమేశ్వర్‌లో పేలిన సిలిండర్



బాన్సువాడ రూరల్: మండలంలోని సోమేశ్వర్‌లో శుక్రవారం ఓఇంట్లో ప్రమాదవశాత్తు వంటగ్యాస్ సిలిండర్ పేలింది. గ్రామానికి చెందిన కమలవ్వ తిమ్మప్పలకు చెందిన రేకుల ఇంట్లో సిలిండర్ పేలడంతో వంటసామగ్రి, బియ్యం, దుస్తులు కాలిపోయాయి. విషయం తెలుసుకున్న ఫైర్‌సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు.

ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మద్యం తాగి రోడ్డుపై న్యూసెన్స్ చేసిన ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించినట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. నగరంలోని మూడో పీఎస్ పరిధిలోని దుబ్బకు చెందిన రాచకొండ శ్రీకాంత్, కంఠేశ్వర్‌కు చెందిన డెక్కా రవి కుమార్ మూడో టౌన్ పరిధిలో ఈ నెల 26న రాత్రి 10 గంటల ప్రాంతంలో మద్యం సేవించి న్యూసెన్స్ చేయగా ఇద్దరిపై సిటీ పోలీస్‌యాక్ట్ కింద కేసు నమోదు చేసి సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ దగ్గర హాజరు పర్చినట్లు చెప్పారు. దీంతో ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ తీర్పు వెలువరించినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇసుక డంప్ సీజ్



రుద్రూర్: పోతంగల్ శివారులో అక్రమంగా నిల్వ చేసిన 60 ట్రిప్పుల ఇసుక డంప్‌ను శుక్రవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. ఈ డంప్‌ను శనివారం మధ్యాహ్నం పోతంగల్ మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో వేలం వేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ. ఐదు వేలు డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

బాకర్‌ఫారం వద్ద..

పోతంగల్ మండలం బాకర్‌ఫారం వద్ద గురువారం అర్ధరాత్రి ఇసుక టిప్పర్‌ను సీజ్ చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. అనంతరం కోటగిరి పీఎస్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తే వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

సీజ్ చేసిన టిప్పర్‌కు రూ.50వేల జరిమానా

పోతంగల్‌లో ఇటీవల సీజ్ చేసిన ఇసుక టిప్పర్‌కు మైనింగ్ శాఖ అధికారులు రూ.50వేలు జరిమానా విధించినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

దాడి చేసిన వారిపై కేసు నమోదు

సిరికొండ: మండలంలోని పెద్దవాల్గోట్ గ్రామానికి చెందిన రవితేజ అనే యువకుడిపై దాడి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్ రామ్ శుక్రవారం తెలిపారు. వినాయక నిమజ్జనం సమయంలో రవితేజకు అదే గ్రామానికి చెందిన అఖిలేష్ అనే వ్యక్తి నాన్నతో గొడవ జరిగింది. ఆ గొడవను దృష్టిలో పెట్టుకొని అఖిలేష్ తన స్నేహితులైన కుషాల్, దీపక్, నితిన్‌తో కలిసి రవితేజపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అఖిలేష్ అతని స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం



సీఎంఆర్ షాపింగ్ మాల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న ఎంపీ ధర్మపురి అర్వింద్, పక్కన ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూకిరణ్, మాల్ నిర్వాహకులు

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, మేయర్ నీతూకిరణ్ శుక్రవారం ప్రారంభించారు. ప్రజలకు అందుబాటు ధరల్లో అందిస్తున్న సీఎంఆర్ షాపింగ్ మాల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ అర్వింద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సినీ నటి పాయల్‌రాజ్‌పుత్, హీరో రామ్ పోతినేని షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో పాల్గొని సందడి చేశారు. దీంతో అభిమానులు, కొనుగోలుదారులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సినీ నటి పాయల్‌రాజ్‌పుత్ పలు వస్త్రాభరణాలను పరిశీలించి, ప్రదర్శించారు. ఈ సందర్భంగా షాపింగ్‌మాల్ ఎదుట ఏర్పాటు చేసిన వేదికపై సినీ నటి చేసిన డ్యాన్స్ ఆకట్టుకుంది.సినీతారలను చూసేందుకు జిల్లా ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ యజమాని వెంకటరమణ, కార్పొరేటర్ హేమలత, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, బస్వాలక్ష్మీనర్సయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సినీ హీరో రామ్



డ్యాన్స్ చేస్తున్న సినీ నటి పాయల్

సంక్షిప్తం

విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలి



ఎల్లారెడ్డి : విద్యార్థులు సక్రమంగా చదువుకోవాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డిలోని జెడ్పీబాలుర ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సక్రమంగా బోధించాలని, రుచికరమైన భోజనం అందించాలన్నారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీహరిరాజు తదితరులున్నారు.

చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేయాలి

బాన్సువాడ : చెరువుల్లో చేప పిల్లల విత్తనాలను విడుదల చేయాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర మత్స్య సహకార సంఘం చైర్మన్ మెట్టు సాయికుమార్‌కు వినతి పత్రం అందజేశారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షులు గాదం సత్యనారాయణ, డైరెక్టర్లు తదితరులున్నారు.

విద్యార్థులకు పాఠ్య సామగ్రి అందజేత

బాన్సువాడ రూరల్ : మండలంలోని చిన్న రాంపూర్ జెడ్పీహైస్కూల్, ప్రైమరీ స్కూల్‌లో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన కుర్మ గణేశ్ ఎన్ఆర్ఐ కుర్మ మారుతి సహకారంతో పాఠ్య సామగ్రి పంపిణీ చేశారు. హెచ్ఎం వీరప్ప, ప్రవీణ్, నాయకులు మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

జెండా వద్ద అన్నదానం

మద్నూర్(జుక్కల్) : మద్నూర్ మండల కేంద్రంలో కొలువుదిరిన బాలాజీ జెండాకు భక్తులు ప్రతి రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం జెండా వద్ద భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఆదివారం శ్రీ వారి బాలాజీ జెండా తిరుపతికి బయలుదేరుతుందని జెండా ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): ఎల్లారెడ్డి మోడల్ స్కూల్ నుంచి బదిలీ అయిన టీచర్లను పాఠశాల సిబ్బంది, విద్యార్థులు శుక్రవారం సన్మానించారు. టీచర్లు సాయిబాబా, శశిశంకర్, నాగరాజు, శ్రీనివాస్, అంజిలప్ప, స్రవంతి, లక్ష్మీనర్సయ్య, జనార్దన్, గంగాప్రసాద్, శివాజీ, భాగ్యలక్ష్మి, అజయ్‌ను సన్మానించారు. మోడల్‌స్కూల్ ప్రిన్సిపల్‌గా గాంధీ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

నీటి లీకేజీలు లేకుండా చూడాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): గ్రామాల్లో నీటి లీకేజీలు లేకుండా చూసుకోవాలని డీఎల్‌పీవో సురేందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆజామాబాద్ గ్రామంలో వాటర్‌మెన్‌లకు నీటి సరఫరాకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఎంపీవో ప్రకాశ్ తదితరులున్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

రాజంపేట : మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఐకేపీ అధికారులు పేర్కొన్నారు. మండల మహిళా సమాఖ్య రాజంపేటలో ఫిష్ పాండ్ నిర్మాణపైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తలమడ్లలో అల్లె భూమవ్వ నిర్వహిస్తున్న ఫిష్ పాండ్ ను సందర్శించారు. ఈ కార్యక్రమంలో అధికారి రమేష్ బాబు, ఎంపీడీఓ రాజేశం, ఏపీఎం సాయిలు తదితరులున్నారు.

బాసర గోదావరి నదిలో మహిళ గల్లంతు

ధర్మారం(బి) గ్రామంలో విషాదం



గోదావరిలో గల్లంతైన జయ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామానికి చెందిన కర్రోళ్ల జయ(35) నిర్మల్ జిల్లా బాసర గోదావరి నదిలో స్నానం చేస్తుండగా నీటి ప్రవాహానికి గల్లంతైంది. కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జయ తల్లి కోటగిరి లక్ష్మి ఇటీవల చనిపోయింది. శుక్రవారం తన తమ్ముడు రవి, అతడి భార్య కృష్ణవేణి వారి పిల్లలతో కలిసి జయ బాసర గోదావరిలో స్నానాలు చేసేందుకు వెళ్లారు. మధ్యాహ్నం పుష్కర ఘాట్ వద్ద జయ ముందుగా తమ్ముడి పిల్లలకు స్నానాలు చేయించి వారిని ఒడ్డున కూర్చోబెట్టి నదిలోకి దిగింది. అప్పటికే నదిలో తమ్ముడి భార్య కృష్ణవేణి స్నానం చేస్తోంది. ఇద్దరూ కలిసి స్నానాలు చేస్తుంటే రవి ఒడ్డున ఉండి తన మొబైల్‌లో వీడియో చిత్రీకరిస్తున్నాడు. ఇంతలోనే ఒక్కసారిగా జయ, కృష్ణవేణి నీటిలో మునుగుతూ కొట్టుకుపోసాగారు. అది చూసి షాక్‌కు గురైన రవి కేకలు వేయడంతో దగ్గరలో ఉన్న జాలర్లు వెంటనే ఇద్దరిని కాపాడేందుకు యత్నించారు. కృష్ణవేణిని కాపాడారు కానీ జయ నీటి ప్రవాహంలో కొట్టుకుపోయింది. జయ కోసం పోలీసులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టినా ఆచూకీ లభించలేదు. జయ భర్త గతంలోనే మృతి చెందడంతో తల్లి వద్దే ఉంటోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే జయ మృతితో ధర్మారం(బి) గ్రామంలో విషాదం నెలకొంది. బాసర పోలీసులు కేసు నమోదు చేసి జయ మృతదేహం కోసం గాలిస్తున్నారు.

ఆటోలో ప్రయాణికురాలి బంగారం చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్ వద్ద ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మెడ నుంచి బంగారు గొలుసును తోటి మహిళలు ఎత్తుకెళ్లినట్లు మూడో టౌన్ ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాక్లూర్ మండలం వడ్యాట్‌పల్లి గ్రామానికి చెందిన ఆర్ల భూలక్ష్మి పని నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లగా స్వగ్రామానికి వచ్చేందుకు నిజామాబాద్ బస్టాండ్ వద్ద ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు ఆటో డ్రైవర్ కంఠేశ్వర్ నుంచి బైపాస్ రోడ్డు ద్వారా గౌతంనగర్ వైపు తీసుకెళ్లారు. గౌతంనగర్ ప్రాంతంలో ఇద్దరు మహిళలు భూలక్ష్మి మెడలో ఉన్న రెండు తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని ఆటో నుంచి నెట్టేశారు. ఆటోలో ఉన్న ఇద్దరు మహిళలు, ఆటో డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎండు గంజాయి కేసులో ఇద్దరి రిమాండ్

కామారెడ్డి క్రైం: సదాశివనగర్ మండలం వజ్జెపల్లి, యాచారం గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో ఎండు గంజాయిని సరఫరా చేస్తూ పట్టుబడిన ఇద్దరిని శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కామారెడ్డి ఎక్సైజ్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ విజయ్ కుమార్ మాట్లాడారు. మొదట వజ్జెపల్లిలోని కామిండ్ల రాజశేఖర్ వద్ద తనిఖీలు చేయగా 70 గ్రాముల గంజాయి లభించిందన్నారు. అతడిని విచారించగా యాచారం తండాకు చెందిన తిరుపతి వద్ద కొనుగోలు చేసినట్లు తెలుపగా తిరుపతి ఇంట్లో సోదాలు చేశామన్నారు. అక్కడ మరో 70 గ్రాముల ఎండు గంజాయి లభించిందన్నారు. మొత్తం 140 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్, సిబ్బంది రాజు, ప్రకాశ్, రాధిక, ఆంజనేయులు, దేవకుమార్, రమ, శ్రీరాం పాల్గొన్నారు.



నిందితుల అరెస్టును చూపుతున్న పోలీసులు